
# రుణం



## సింహ ప్రసాద్

> "వాళ్ళ గొడవ మనకెందుకురా. ఎవరో ఏదో వెధవ పని చేశారని మనమూ చేస్తామా. రైతు లోకానికి తిండి పెట్టేవాడే కాని ఒకరి రుణం వుంచుకునే వాడుకాదురా..."

ఇంటి అరుగు మీది కుక్కి మంచం మీద మునగదీసుకుని పడుకున్నారు శివరామయ్య.

ఎనభై ఏళ్ళ ఆయన శరీరం ముడతలు పడి వేళ్ళాడుతోంది. ఒంటిలోని ఎముకలన్నీ ముందుకి పొడుచుకుకొచ్చినట్టుగా వున్నాయి. ఏదో బాధ్యత మిగిలిపోగా అది తీరేవరకూ తప్పదన్నట్టుగా కొట్టుకుంటుందాయన గుండె.

ఇంతలో దగ్గు తెర వచ్చింది. నరాలు మెలి తిరిగినట్టుగా విలవిల్లాడారు.

"ఇంకా ఈ చెఱ ఎన్నాళ్ళో!" అనుకోకుండా వుండలేకపోయారు.

రొద చేసుకుంటూ వచ్చి ఇంటి ముందాగిందో జీపు.

కళ్ళు చిట్లించి చూశారు శివరామయ్య.

బ్యాంకు అధికారులూ సిబ్బందీ గుంపుగా వచ్చారు.

"ఎవరూ..." అతి కష్టం మీద లేచి కూర్చుంటూ అడిగారు శివరామయ్య.

"బ్యాంకు వాళ్ళమండీ. బాకీ వసూలు నిమిత్తం పైనుంచి ఉన్నతాధికారులొచ్చారు..."

"అలాగా. ఒరేయ్ ఎవడ్రా ఆడ..." పీల గొంతుతో అరిచారు.

పాలేరు పరుగునొచ్చాడు.

"కుర్చీలు తెచ్చెయ్యరా"

గబగబా పాతకాలపు కుర్చీలు తెచ్చి వేసి తుడిచి ఎడంగా జరిగాడు.

"కూర్చోండి బాబయ్యా..."

"మా బాకీ సంగతి..." అనేదో చెప్పబోతుంటే వారి మాటలు విన్పించుకోకుండా, "బేధ్యం మొహం వేసుకుని నిలబడ్డావేంరా. మంచి తీర్థం తెచ్చివ్వు" అని పాలేరు మీద అరిచారు శివరామయ్య.

వయస్సు పైబడినప్పటికీ తనీ ఇంటి యజమానిని సుమా అని చెప్పడానికాయన తాపత్రయపడుతున్నట్టుగా భావించారు బ్యాంకు అధికారులు.

పాలేరు తెచ్చిచ్చిన మంచి నీళ్ళు త్రాగేక గొంతు సవరించుకున్నాడు బ్యాంకు మేనేజరు "ఎనిమిదేళ్ళ క్రితం మోటారు కోసం మీరు మా బ్యాంకులో రెండు వేలు అప్పు తీసుకున్నారు. అదిప్పుడు తొమ్మిది వేలయ్యింది. ఇంతవరకూ ఒక్క పైసా కూడా జమ చెయ్యలేదు. మేం ఎన్నిసార్లు మీ ఇంటి చుట్టూ తిరిగినా మీరు చెల్లించలేదు. అందుకని హైదరాబాదునుంచి మా ఉన్నతాధికారి వచ్చారు..."

"ఎప్పటి బాకీ ఏనాటి సంగతి! మా చిన్నోడు ఇస్కూల్లో చదివినప్పటి కత!"

"అయినా మీరింతవరకూ అసలుగాని వడ్డీగాని చెల్లించలేదు..."

"ఆ బాకీలన్నీ మాఫీ అయిపోయినాయ్గదా"

"అబ్బే ఇవి అవ్వలేదు. అందుకనేగా మీ చుట్టూ కాళ్ళరిగేలా వసూళ్ళకోసం తిరిగానూ!"

"నువ్వెప్పుడొచ్చావు. ఎప్పుడూ చూసిన మొకంలా లేదు..."

మేనేజరు ఇబ్బంది పడుతోంటే సంగతి అర్థమై ఉన్నతాధికారి ముందుకొచ్చాడు.

"చూడండి శివరామయ్యగారూ. మీరు పెద్దవారు. నలుగురికి హితవు చెప్పాల్సినవారు. పదిమందికి ఆదర్శంగా వుండాల్సినవారు. అలాటి మీరు మీ అప్పు చెల్లించకపోవడం సబబుగా లేదు. మా వాళ్ళు సరిగ్గా అడిగివుంటే మీరెప్పుడో తీర్చేసేవారనీ, ఎక్కడ్నుంచో మాబోటి వాళ్ళని రప్పించేవారు కాదనీ మాకు తెలుసు. సరే జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడైనా మీరు పెద్ద మనసు చేసుకొని మీ అప్పుకి శ్రీరామ చుట్టేస్తే బావుంటుంది..."

ఆయన మాటలు శివరామయ్య మీద బాగా పని చేశాయి. కాస్సేపేదో ఆలోచించి అడిగారు "బాకీ ఎంతన్నారూ..."

"తొమ్మిదివేల రెండోందలు..."

"మూడు నాలుగు రోజుల్లో పంపిస్తాన్లెండి. నేను వేలి ముద్దర వేసిన కాయితం మీ కాడే వుందిగదా"

"ఉందండి. మీరు బాకీ తీర్చిన మరుక్షణం తిరిగిచ్చేస్తాం. మరి వస్తామండీ. ఇలా ఇంటికొచ్చి అడిగినందుకు ఏమీ అనుకోకండి. మా డ్యూటీ మేం చెయ్యాలి కదా. మీరు మాటకి ప్రాణాలిచ్చేవారని మిమ్మల్ని చూడగానే తెలిసిపోయింది..."

"పంపిస్తాన్నాగా పంపిస్తాన్లెండి..."

వాళ్ళు వెళ్ళడానికుద్యుక్తులవుతోంటే "కూర్చోండి కూర్చోండి ఇంటికొచ్చి గొంతు తడుపుకోకుండా ఎలా వెళ్తారూ" అని చెప్పి "దాహానికి తెచ్చివ్వరా" అన్నారు పాలేర్తో.

అప్పటికీ ఆడవాళ్ళు వేడి వేడి పాలూ చల్లని మజ్జిగా సిద్ధం చేసి వుంచారేమో వెంటనే అందించారు. ఎవరికేది కావలిస్తే అది ఇచ్చాడు.

అనంతరం శలవు తీసుకు వెళ్ళిపోయారంతా.

ఆలోచనలో పడ్డారు శివరామయ్య.

"శివరామయ్య మావ బాకీ వున్నాట్ట. అడగడానికొచ్చారు. బ్యాంకోళ్ళు కాటికెళ్ళే వాళ్ళనీ వదిలేట్టు లేరు" పొరుంగిటావిడ ఇరుగిటింటావిడతో అన్న మాటలు ఆయన చెవిలో పడ్డాయి.

గుండెని ముల్లుతో గుచ్చినట్టు విల విల్లాడారాయన. ఇంట్లోని ఆడవాళ్ళొచ్చి పలకరించినా ఉలుకూ పలుకూ లేకుండా పరధ్యానంగా వుండిపోయారు.

మరో గంట కొచ్చాడు పెద్ద కొడుకు.

ఆడవాళ్ళు సంగతి చెప్పగా "బ్యాంకు వాళ్ళు వచ్చారంటకదా" అనడిగాడు తండ్రిని.

"అవున్రా. ఎప్పుడో తీసుకొన్న బాకీ చెల్లు వేయలేకపోయాను. పాపం పెరిగి నట్టు పెరిగిపోయిందది. బ్యాంకోళ్ళు చెప్పేదాకా అసలా వూసే గుర్తు లేదు..."

"ఇన్నాళ్ళూ ఏం చేస్తున్నారంట? అయి నా పాత బాకీల్ని దేవీలాల్ ఎప్పుడో రద్దు చేసేశాడు కదా"

"నేనూ ఆ భ్రమలోనే వున్నాన్రా. ఇది రద్దవ్వ లేదంట. కట్టాల్సిందే అన్నారు"

"ఇన్నేళ్ళూ నిద్రపోయి ఇప్పుడొచ్చి కట్ట మంటే కట్టేస్తామేంటి. తిరిగి తిరిగి వాళ్ళే వెళ్తార్లే. కోర్టుకెక్కితే సంగతేవిటో కోర్టులో నే తేల్చుకుందాం"

"అయేం మాటర్రా పెద్దోడా. ఈ వయస్సులో నన్ను కోర్టుకీడుస్తానంటా వేంటి. అప్పు చేసినప్పుడు తీర్చొద్దా?" కలవరపడ్తూ అన్నారు.

"వీళ్ళ ప్రతాపం మనలాటి వాళ్ళ మీద కాదు కోట్లకి కోట్లు బాకీలున్న పెద్ద వాళ్ళ మీద చూపించమను..."

"ఆ గొడవలు మనకెందుకు. మన బాకీ మనం తీర్చేసి మన కాయితం తెచ్చేసుకుందాం"

"నువ్వు దాచిపెట్టిన ముల్లె వుంటే అలాగే తీరుద్దాం..." అనింకేదో అన బోయినవాడల్లా ముసలాయన మొఖం చూసి తగ్గి అన్నాడు "నేననకూడదుగాని అయ్యా. ఇవాళో రేపో అనేట్టన్నావు. నీకు ఈ బాకీలూ జంఝాటాలూ ఎందుకు చెప్పు. హాయిగా క్రిష్ణారామా అనుకుం టూ పడుకో"

మరో మాటకి అవకాశమివ్వకుండా వెళ్ళిపోయాడు పెద్ద కొడుకు.

శివరామయ్య అవాక్కై పిచ్చి చూపులు చూస్తూండిపోయారు.

మరి కాస్సేపటికి చిన్న కొడుకొచ్చాడు. పిలిచి మంచం మీద కూర్చోమన్నారు.

"ఏంటో త్వరగా చెప్పు" అన్నాడతడు విసుగ్గా. "బ్యాంకోళ్లొచ్చార్రా. ఎప్పుడో నేను చేసిన బాకీ కట్టమని పీకల మీద కూర్చున్నార్రా. అది కాస్తా తీర్చెయ్యండ్రా అబ్బాయ్"

"అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహ త్యలు చేసుకుంటుంటే వీళ్ళు అప్పుకట్ట మని వస్తారా. వాళ్ళకి బుద్ధి లేకపోతే నీ బుద్ధేమైపోయింది. ఇప్పుడు తీర్చడానికి నీ కాడ ఏమీ లేదని చెప్పకపోయావా"

"అదేం మాటరా. చేతికందొచ్చిన కొడుకులుండగా అలా ఎలా చెప్పేదిరా"

"అందుకే మన బతుకులిలా వున్నాయి! కాసిని అప్పులకే గుండె చెదిరి రైతులు పురుగు మందులు మింగేస్తు న్నారు. వందల కోట్లు ఎగ్గొట్టి పెద్ద పెద్దో ళ్ళు మేడల్లో మిద్దెల్లో కులుకుతున్నారు!"

"వాళ్ళ గొడవ మనకెందుకురా. ఎవరో ఏదో వెధవ పని చేశారని మన మూ చేస్తామా. రైతు లోకానికి తిండి పెట్టేవాడే కాని ఒకరి రుణం వుంచుకునే వాడుకాదురా. తల తాకట్టు పెట్టి అయి నా అప్పు తీర్చాలని చూస్తాడు కాని ఒకరి వుసురు పోసుకోడురా"

"ఈ సత్తె కాలపు కబుర్లే మనల్ని గతికి తీసుకొచ్చాయి. రేపేం జరుగుద్దో వాళ్ళేం చేస్తారో మేం చూసుకుంటాంలేగాని నువ్వు నిశ్చింతగా పడుకో"

"గుండెల మీద కుంపట్లా అప్పు వుంటే..."

"మాకు లేని దిగులు నీకెందుకు చెప్పు?"

"అది కాదురా చిన్నోడా..."

"వూరికే నన్ను విసిగించకు. నా దగ్గర డబ్బు లేదు. నేను కట్ట లేను. నీ పెద్ద కొడుకు కడతాడేమో కనుక్కో"

"వాడసలు వినటమే లేదురా!"


"మరింకేం. నోర్మూసుకొని తొంగో" పై పంచె దులిపి వెళ్ళిపోయాడు.

వెర్రిగా చూస్తూండిపోయారు శివరామ య్య.

'కాలూ చెయ్యీ బాగున్నప్పుడే ఎలా వోలా బాకీ తీర్చేసుండాల్సింది" అని పదే పదే బాధ పడ్డారు.

కన్ను తెరిచినా మూసినా ప్రోనోటు మీది ఎర్రబిళ్ళ మీద వేసిన వేలి ముద్రే కన్పిస్తోంది!

రాత్రి భోజనాలప్పుడు మళ్ళీ ఆ వూసె త్తారాయన.



"అన్ని గొడవలూ నీకే కావాలంటే వేంటి ముసలాయనా. ఆస్తులు కొడుకు లకి పంచిచ్చావు కదా. అప్పులూ వాళ్ళే చూసుకుంటార్లే" అంది పెద్ద కోడలు.

"అలాగంటావేంటమ్మా. ఒకరి రుణాన పడి పొమ్మంటివా"

"పోయేది సర్కారోడి సొమ్మే కదా" అంది చిన్న కోడలు.

"ఎవరైనా ఒకటే. ఫలానా శివరామ య్య బాకీ ఎగ్గొట్టాడు అన్న మాట నేను పడ్లేను" తెగేసి చెప్పేరు.

"నువ్వే కాదు మేవూ మొండి వాళ్ళమే. కట్టడానికి నా దగ్గర డబ్బు లేదు. చిన్న కొడుక్కి పెద్ద మూట ఇచ్చావు కదా. వాడ్ని కట్టమను" అన్నాడు పెద్ద కొడుకు.

"సగం ఆస్తి పెద్ద కొడుక్కోసమే కరిగిం చేశావు కదా అన్నయ్యనే కట్టమను. నా దగ్గర ఈడ్చి తన్నినా పైసా లేదు" అన్నాడు చిన్న కొడుకు.

నిస్సహాయంగా చూస్తుండి పోయారు శివరామయ్య.

ఆ రాత్రి నిద్రపట్టలేదాయనకి.

మర్నాడు మాటా పలుకూ లేకుండా మౌ నంగా వుండి పోయారాయన. కోడళ్ళు పిలి చినా పలకలేదు. మనవలు మంచమెక్కి అల్లరి చేసినా పట్టించుకోలేదు.

ఒంట్లో ఎలా వుందంటూ కంగారు పడ్డారంతా. బాగానే వుందని జవాబి చ్చారప్ప కాఫీ తాగలేదు. ఇడ్లీలు తిన లేదు. ఆఖరికి చుట్ట కూడా కాల్చలేదు.

ముసలాయన. మంకు పట్టిన సంగతి గ్రహించారంతా.

పెద్ద కొడుకు ధుమ ధుమ లాడాడు. చిన్న కొడుకు నచ్చ చెప్పడానికి శతాథా యత్నించాడు. కానాయన పంతంలో మార్పు లేదు.

"సత్య కాలపు మనిషాయన. ఆయన్నీ వయస్సులో బాధపెట్టం బావో లేదు. మీరే ఏదో దారి చూడండి" అంది పెద్ద కోడలు.

చిన్న కొడుకు బలపరిచాడు.

"బ్యాంకుకు వెళ్ళి బాకీ ఎంతో కనుక్కోరా. వడ్డీ ఏమైనా తగ్గుతాదేమో చూడు. ఏ ధాన్యం కమీషనర్ దగ్గరో డబ్బు తీసుకొని తీర్చేద్దాం. మనకింత చేసిన ముసలాయన రుణం ఈ రకంగా తీర్చుకుందాం" అన్నాడు పెద్ద కొడుకు.

తలాడించాడు తమ్ముడు.

ఇద్దరూ తండ్రి దగ్గరికెళ్ళి "నీ బాకీ తీర్చేస్తున్నాంలే ఇంక లేచి కాఫీ తాగు" అన్నారు.

శివరామయ్య కళ్ళు అశ్రుపూరితా లయ్యాయి.

"తల్లి భూదేవి రుణం తప్ప అన్ని రుణాలూ తీర్చి వెళ్ళిపోతాన్రా. అప్పుడే దేవుడి ప్రశ్నకి సమాధానం చెప్పగలం" అన్నారాయన.

"సరేలే" అని పైకి అని, "చాదస్తపు మనిషి" అని లోపలనుకున్నారు.

మరుసటి రోజునే బాకీ చెల్లించి ప్రోనో టు తెచ్చిచ్చాడు చిన్న కొడుకు. నోటుని చూసి శివరామయ్య పరమానందపడి పోయారు. కన్నీళ్ళు జలజలరాలిపో యాయి. వేలి ముద్ర వంక పదే పదే చూసుకుని మురిసి పోయారు.

ఇన్నాళ్ళూ తనని కట్టిపడేసిన కనిపిం చని బంధనాలన్నీ ఫట్ ఫట్‌మని తెగి పోయినట్టూ అంతులేని స్వేచ్ఛ లభించి నట్టూ పొంగిపోయారు.

నోటుని గుండెల మీద పెట్టుకొని నిశ్చింతగా పడుకున్నారు శివరామయ్య.

గాలి వేగంగా వీచింది.

ఆయన చేతిలోంచి ప్రోనోటు ఎగిరి పోయింది.

ఆయనలోని చిలకా ఎగిరిపోయింది!